సాక్షి కర్నూలు

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



పల్లెలు సుగ్గి బాట

సొంతూరిలో ఉపాధి కరువై బతుకు తెరువు కోసం పనులు వెతుకుంటూ వ్యవసాయ కూలీలు వలస బాట పడుతున్నారు. వారం రోజులుగా పల్లెలు ఖాళీ అవుతున్నాయి.

IIలో▸



ఇద్దరు విద్యార్థుల గల్లంతు

గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద పారుతున్న నీటిలో ఆడుతూ, సెల్ఫీలు తీసుకుంటూ ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతి దేహం లభ్యమైంది.

IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.82
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.417
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,624
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,508

న్యూస్‌రీల్

ఉరుకుంద భక్తులకు నేటి నుంచి ఆన్‌లైన్ సేవలు



ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం

కౌతాళం: కార్తీకమాసంలో ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారని, వారికి సులభతర దర్శనం కల్పించేందుకు ఈ నెల 17 నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రూమ్స్, దర్శనం టిక్కెట్స్ బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. భక్తుల ఆధార్‌కార్డు వివరాలతో కౌంటర్‌లో పరిశీలించి భక్తులకు అనుమతి ఇస్తారన్నారు. వాట్సప్ ద్వారా సేవలు కూడా అందుతాయని భక్తులు ఉపయోగించుకోవాలన్నారు.


తగ్గుముఖం పట్టిన వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాలు తగ్గుముఖం పట్టాయి. సెప్టెంబర్ నెల వరకు రైతులను అధిక వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఖరీఫ్ పంటలను దెబ్బతీసిన వర్షాలు అక్టోబర్ నెలలో అంతంతమాత్రానికే పరిమితం కావడం గమనార్హం. అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ ఉండగా.. 16 రోజుల్లో కేవలం 20 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడుతున్నా వర్షాలు తేలికపాటికే పరిమితం అవుతున్నాయి. కాగా బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఏడు మండలాల్లో తేలికపాటి నుంచి ఒకమోస్తరు వర్షాలు కురిశాయి. క్రిష్ణగిరిలో 18.8, ఆస్పరిలో 9, కర్నూలు రూరల్‌లో 4.6, కర్నూలు అర్బన్‌లో 3.2, మద్దికెరలో 2.2, సీ.బెలగల్‌లో 1.4, దేవనకొండ1.4 మిమీ ప్రకారం వానలు కురిశాయి. కాగా ఉష్ణోగ్రతల తీవ్రత కూడా పెరిగింది. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

మరో ఇద్దరు చిన్నారులకు డెంగీ

వెల్దుర్తి: డెంగీ కేసులు వెల్దుర్తి మండలంలో పెరిగిపోతున్నాయి. ఇప్పటికే 10 మంది డెంగీ బారిన పడంతో రామళ్లకోట పీహెచ్‌సీ సిబ్బంది వెల్దుర్తిలో వీధి వీధినా సర్వే నిర్వహిస్తున్నారు. వెల్దుర్తి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కృష్ణగిరి మండల కేంద్రం, అల్లుగుండు గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలు డెంగీ బారిన పడ్డట్లు గురువారం వైద్యులు ధ్రువీకరించారు. డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ-కోర్టు ప్రారంభం



ఈ-కోర్టును ప్రారంభిస్తున్న పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్యుల సౌలభ్యం కోసం ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఈ-కోర్టును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-కోర్టు ద్వారా వైద్యులకు ఎంతో సమయం ఆదా అవుతుందని, పని చేసే ప్రదేశం నుంచే రాష్ట్రంలోని ఏ కోర్టుకైనా ఇక్కడి నుంచే ఈ-కోర్టు ద్వారా మెడికల్ ఎవిడెన్స్ అందించే చక్కటి అవకాశం లభించిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా కర్నూలు మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రభుత్వ సంబంధిత కోర్టు కేసులలో వారి సాక్ష్యాన్ని ఇక్కడి నుంచే రాష్ట్రంలో ఏ కోర్టుకైనా ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఎంఈ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రేణుక, డాక్టర్ సాయిసుధీర్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ, డాక్టర్ సుధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపు రెండో విడత 'పారా' కౌన్సెలింగ్

కర్నూలు (హాస్పిటల్): డిప్లొమా ఇన్ పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రెండో విడత కౌన్సెలింగ్ శనివారం నిర్వహిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ఉంటుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరువాలని పేర్కొన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ అలైడ్, హెల్త్ కేర్ సర్వీసెస్ (డిప్లొమా ఇన్ పారా మెడికల్) కోర్సుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ చేస్తున్నామని తెలిపారు.

ఆధ్యాత్మిక బాటలో అభివృద్ధి మంత్రం



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ

- శ్రీశైలంలో మల్లన్న దర్శనం..కర్నూలులో బహిరంగ సభ
- రాయలసీమలోని ఓర్వకల్, కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- పీఎం మోదీకి ఓర్వకల్ ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం, వీడ్కోలు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉమ్మడి జిల్లా పర్యటన ఆధ్యాత్మిక వాతావరణంలో అభివృద్ధికి భరోసా కల్పించింది. జై భారత్.. జై మోదీ నినాదాలు మారుమ్రోగాయి. ఉమ్మడి జిల్లాలోని శ్రీశైలం, కర్నూలులో పర్యటించేందుకు మోదీ ఉదయం 10.30గంటలకు ప్రత్యేక విమానంలో ఓర్వకల్ ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. ఆయనకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన హెలికాప్టర్‌లో శ్రీశైలం పర్యటనకు బయలుదేరి వెళ్లారు. సున్ని పెంటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.40 గంటలకు చేరుకోగా.. నంద్యాల కలెక్టర్ రాజకుమారి గనియా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. 11.48 గంటలకు శ్రీశైలం దేవస్థానం చేరుకున్న మోదీకి వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. మొదటి సారి మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవిలకు ప్రధానమంత్రి అర్చన, కుంకుమార్చన పూజలు చేసుకొని కాసేపు ధ్యానం చేశారు. అనంతరం 12.35 గంటలకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రాజదర్బార్‌లోని గోడలపై శివాజీ జీవిత చరిత్రను శిల్పాల రూపంలో చిత్రీకరించిన చిత్రమాలికలను ఆసక్తిగా తిలకించి శివాజీ విగ్రహానికి పుష్పాలను సమర్పించారు. అక్కడే ఉన్న శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా సందర్శించి శివాజీ, అమ్మవారి విగ్రహాలకు పుష్పాలు సమర్పించారు. కాగా, 8 వేల మంది శివ సేవకులు కాషాయ వస్త్రధారణతో మోదీ మోదీ అంటూ నినదించడంతో శ్రీగిరిలు పులకించాయి. అనంతరం శ్రీశైలం పర్యటనను ముగించుకొని 1.58 గంటలకు కర్నూలుకు బయలుదేరిన మోదీ, నన్నూరు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్‌కు 2.30 గంటలకు చేరుకున్నారు.

మార్మోగిన మోదీ నామస్మరణ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నన్నూరు సమీపంలో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్ సభలో పాల్గొనేందుకు రాగా మోదీ మోదీ అంటూ సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం ప్రత్యేక ఓపెన్ టాప్ వాహనంలో మోదీ, చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు అభివాదం చేస్తూ వెళ్తుండగా ప్రజలు జాతీయ జెండాలు ఊపి సంఘీభావం తెలిపారు. 2.40 గంటలకు సూపర్ జీఎస్టీ సభలో పాల్గొని రూ.13,430 కోట్ల విలువ చేసే పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో రాయలసీమలోని ఓర్వకల్, కొప్పర్తి పారిశ్రామికవాడల్లో రూ.4,922 కోట్ల అభివృద్ధి పనులు.. కర్నూలు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతానికి సంబంధించి రూ.2886 కోట్ల పనులు ఉన్నాయి. అంతకముందు స్టేజీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం చంద్రబాబునాయుడు, డీప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాలువా కప్పి మహాశివుడి ప్రతిమతో కూడిన జ్ఞాపికను అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శాలువాలు కప్పి సత్కరించి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అందించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రాష్ట్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని మంత్రి నారాలోకేష్ ప్రధానమంత్రికి అందించారు. అనంతరం 4.15 గంటలకు సభను ముగించుకొని ప్రధానమంత్రి నన్నూరు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకొని ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లగా గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీడ్కోలు పలుకారు.

పోలీసుల లాఠీచార్జి

కాగా, సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ సభ బయట పోలీసులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జీ చేశారు. కొందరు టీడీపీ నాయకులు దూసుకెళ్లందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు లాఠీచార్జీ చేయగా టీడీపీ నాయకులు పారిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

నమోస్మరామి అంటూ వక్తల ప్రసంగాలు..

సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో వక్తలు నరేంద్రమోదీని స్మరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏకంగా 21వ శతాబ్దంలో మోదీ అరుదైన వ్యక్తి అని, ఆయన సహకారంతో వికసిత్‌భారత్–2047 నెరవేరుతుందని, ఏపీ స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధిస్తుందని పొగడ్తల్లో ముంచెత్తారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మోదీ కర్మయోగి అని, ఆయనకు దేశం తప్ప మరేది కాబట్టదని చెప్పారు. మంత్రి నారాలోకేష్ మాట మాటకు నమో అంటూ అద్యంతం మోదీ భజన చేశారు. కార్యక్రమంలో ఎంపీలు నాగరాజు, బైరెడ్డి శబరి, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వెనుతిరిగిన మహిళలను ఆపుతున్న పోలీసులు



మహిళలను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు



తోపులాట నేపథ్యంలో పోలీసులు లాఠీకి పనిచెప్పడంతో రాళ్లు రువ్వుతున్న కూటమి శ్రేణులు

'నస్య' సంకల్పం.. శిఖర దర్శనం

- శ్రీశైలంలో ప్రధాని పర్యటన విజయవంతం
- స్వామికి పంచామృతాలతో అభిషేకం
- అమ్మవారికి కుంకుమార్చన
- శివాజీ దర్బార్ హాల్, ధ్యాన కేంద్రాల సందర్శన



శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రంలో అడుగు పెట్టినప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ భక్తిశ్రద్ధలతో సుమారు మూడు గంటల పాటు గడిపారు. సంప్రదాయ వస్త్రధారణ అయిన పంచె, కాషాయ రంగు పైవస్త్రం ధరించారు. సంప్రదాయరీతిలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. గోత్ర నామాలతో పాటు అఖండ భారతావనీ సస్యశ్యామలతా సిద్ధర్థ్యం, సనాతన ధర్మ వృద్ధ్యర్థం, గోసంరక్షణార్థం, శ్రీశైల క్షేత్ర సర్వతోభిముఖ వృద్ధ్యర్థం అని సంకల్పించారు. ఆలయ రాజగోపురం వద్ద ప్రధానికి ప్రధానార్చకులు విభూతి, కుంకుమధారణ చేశారు. ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

మంత్ర పుష్పాలతో దర్శనం

ప్రధానార్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా ధ్వజస్తంభానికి తలను అనించి ప్రధాని నరేంద్ర మోదీ నమస్కరించారు. అనంతరం రత్నగర్భగణపతి స్వామికి గణపతి పూజ నిర్వహించారు. జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారికి ఎకవార రుద్రాభిషేకం (లఘు అభిషేకం) చేశారు. బిల్వాలు, నల్లకలువలు, జిల్లెడుపూలు, మందారాలు, మల్లెపూలతో బిల్వార్చన, పుష్పార్చన నిర్వహించారు. మల్లికార్జున స్వామివారికి మల్లెపూలు అత్యంత ఇష్టమైనవని, భక్తులకు మల్లెపూలతో అర్చించడం వల్లే మల్లికార్జున స్వామి అని పేరు వచ్చిందని ప్రధానికి అర్చకులు నాగరాజుశాస్త్రి తెలిపారు. దీంతో ప్రధాని ఓకే..టీకే అన్నట్లు తెలుస్తోంది. మహామంగళహారతి, మంత్రపుష్పాలతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని ప్రధాని దర్శనం చేసుకున్నారు.

ఖడ్గమాలతో కుంకుమార్చన

ఆలయంలోని నందీశ్వరస్వామివారి దర్శనం అనంతరం ప్రధానికి ప్రధానార్చకులు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలను అందించారు. సరస్వతి నది అంతర్వాహినిగా ప్రసిద్ధిచెందిన మల్లికాగుండం వద్ద ప్రధాని స్వామివారి గర్భాలయ శిఖర దర్శనం చేసుకున్నారు. శిఖర దర్శనం కలిగితే పునర్జన్మ ఉండదని ప్రధానికి అర్చకులు మల్లికార్జున శాస్త్రి వివరించారు. నాలుగు యుగాల్లో శ్రీశైల క్షేత్ర ప్రస్తావన ఉందని, శ్రీరాముడు, సీతాదేవి ఆలయంలో లింగాలను ప్రతిష్ఠించారని తెలిపారు. భ్రమరాంబాదేవి ఆలయ ముఖమండపంలో ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాలతో ప్రధాని కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి హారతిని స్వీకరించి దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో పండితులు వేదమంత్రోచ్ఛరణలతో ప్రధానికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందించారు. చెక్కతో తయారు చేసిన స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని ప్రధానికి జ్ఞాపికగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అందించారు.

'స్ఫూర్తి'దాయకం



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో చిత్రాలను పరిశీలిస్తున్న ప్రధాని

శివాజీస్ఫూర్తి కేంద్రాన్ని ప్రధాని నరేంద్రమోదీ దర్శించారు. శివాజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దర్బార్‌లో త్రీడీ చిత్రాలతో ఏర్పాటు చేసిన శివాజీ జీవిత చరిత్రను చూశారు. నావికాదళానికి శివాజీ రాజముద్రను చిహ్నంగా మోదీ ఏర్పాటు చేయగా.. అది దర్బార్‌లో ఉండడంతో చూసిన ప్రధాని చిరునవ్వు చిందించారు. శివాజీ దర్బార్‌ను 1994 అక్టోబరు 16న ప్రారంభించామని, 2025 అక్టోబర్ 16న భారత ప్రధాని సందర్శనకు రావడం విశేషమని నిర్వాహకులు వివరించారు. దీంతో ప్రధాని చిరునవ్వులు చిందించారు. అనంతరం శివాజీ ధ్యానం చేసిన ధ్యాన మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దర్బార్ హాల్‌లో ఉన్న జీవితవిశేషాలను డిజిటలైజేషన్ చేస్తే బాగుంటుందని ప్రధాని అన్నట్లు నిర్వాహకులు నాగేశ్వరరావు తెలిపారు.

గృహ నిర్బంధాలు.. అరెస్టులు

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను పోలీసులు గురువారం తెల్లవారు జామున గృహ నిర్బంధం చేశారు. కొందరిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ప్రీతిబాయ్ తల్లి పార్వతీని కూడా ఇంట్లోనే నిర్బంధించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, నాయకులు పి.నిర్మల, రాజశేఖర్, విజయ్, షరీఫ్, అబ్దుల్లా, ఐద్వా నాయకులు అలివేలమ్మ, శ్యామలమ్మ, వెంకటేష్‌లను గృహ నిర్బంధం చేయగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గిడ్డమ్మ, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిలను అరెస్టు చేసి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా.. అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలపై వామపక్షాల నాయకులు ఆగ్రహించారు. సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట, సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో ధర్నాలకు దిగారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాను ఎంతసేపటికి విరమించకపోవడంతో సీపీఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు మాల విద్యార్థి సంఘం అధ్యక్షుడు వెంకటేష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు యాట ఓబులేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి తదితరులను కూడా పోలీసులు గృహనిర్బంధం చేసి అరెస్టు చేశారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు పౌరుల స్వేచ్ఛను హరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి విమర్శించారు. అరెస్టులు, గృహ నిర్బంధాల్లో ఉన్న ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



సూపర్ జీఎస్టీ సభకు ఆర్టీసీ బస్సుల్లో వస్తున్న జనం



సీపీఐ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు



అనుమతి లేక వాటర్ బాటిళ్లను పడేసిన దృశ్యం

ఎస్పీకి వారెంట్

కర్నూలు: ఓ సివిల్ కేసులో కోర్టు ద్వారా అందిన సమను తీసుకుని అందుకు సంబంధించిన పత్రాలు సమర్పించకపోవడమే కాక న్యాయస్థానానికి ఎలాంటి సమాధానం ఇవ్వనందున జిల్లా పోలీసు శాఖ అధికారి(ఎస్పీ) ప్రత్యక్షంగా హాజరై సమాధానమివ్వాలని కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎస్పీకి బెయిల్ వారెంట్ జారీ చేశారు. ఐఏ 321/25 ఇన్ ఐఏ 112/2021, ఇన్ ఎస్‌టీపీ 58/2012లో ఫిర్యాది తన తండ్రి పి.రహీం ఖాన్ మరణ ప్రయోజనాలు ఎంత వస్తుందో రికార్డుపరంగా తెలపాలని న్యాయ స్థానం ద్వారా కోరారు. పలుమార్లు ప్రభుత్వ న్యాయవాది రికార్డులు పంపాలని సంబంధిత సెక్షన్ అధికారులను కోరినా స్పందించకపోవడంతో చివరకు న్యాయస్థానం ఎస్పీకి బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. న్యాయవాదులు ఎస్.షాషావలి, అర్షియా పర్వీన్ కేసు దాఖలు చేయగా కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

కోటి సంతకాలు.. పేద బతుకుల తల రాతలు

- మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు: మనం సేకరించే కోటి సంతకాలు ఆంధ్రరాష్ట్ర పేద బతుకుల తలరాతలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం చేపట్టిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ పెద్దకడబూరు మండల కేంద్రంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వైద్యవిద్య, నిరుపేదలకు వైద్యం అందేలా గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారని కూటమి నాయకులకు తెలీదా అని ప్రశ్నించారు. డబ్బులు ఎలా దండుకోవాలని 'కూటమి' నాయకులు ఆలోచిస్తున్నారని, పేద ప్రజల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేద్దాం అనే ధ్యాసే లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు దేవుడు మంచిబుద్ధి ఇచ్చి రాష్ట్రాన్ని కాపాడే విధంగా చూడాలని దేవున్ని వేడుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రైవేట్‌కు ఇచ్చిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వం తీసుకుంటుందని, అందరికీ విద్య, వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ విభాగం అధ్యక్షుడు దశరథరెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శి రఘురాముడు, డివిజన్ యూత్ వింగ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి శివరామిరెడ్డి, రైతు విభాగం తాలూకా అధ్యక్షుడు యల్లప్ప, ప్రచార విభాగం తాలుక అధ్యక్షుడు ముక్కరన్న, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, మండల నాయకుడు రామలింగారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అర్లప్ప, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శాంతమూర్తి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు సబ్ జైళ్ల అధికారిగా రామకృష్ణ యాదవ్



కర్నూలు: సబ్ జైళ్ల అధికారిగా(డీఎస్పీ) రామకృష్ణ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడున్న నరసింహారెడ్డి జైళ్ల శాఖ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది ఏలూరుకు బదిలీ అయ్యారు. దీంతో తిరుపతి స్పెషల్ సబ్ జైలర్‌గా ఉన్న రామకృష్ణ యాదవ్‌కు డీఎస్పీగా పదోన్నతి కల్పించి కర్నూలు సబ్ జైలు అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం పక్కనున్న మహిళా జైలు సమీపంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన రామకృష్ణ యాదవ్ 2006లో డిప్యూటీ జైలర్ హోదాలో జైళ్ల శాఖలో చేరి వరంగల్, అనంతపురం ప్రాంతాల్లో పనిచేశారు. 2014లో జైలర్‌గా పదోన్నతి పొంది ఆదోని, మదనపల్లె ప్రాంతాల్లో సేవలందించారు. తిరుపతి సబ్ జైలర్‌గా గత నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కర్నూలుకు వచ్చారు.

క్లుప్తంగా

మట్టి మిద్దె కూలి వృద్ధురాలి మృతి

చిప్పగిరి: వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మట్టి మిద్దె కూలి ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన నేమకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శాంతమ్మ(85) ఇంట్లో ఒంటరిగా నివాసముంటోంది. బుధవారం రాత్రి మంచంపై నిద్రిస్తుండగా పైకప్పు కూలి ఆమెపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలి మృతదేహాన్ని వెలికి తీయించి అంత్యక్రియలు చేయించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వీరు ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిర పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


నరసింహులు (ఫైల్)

మహానంది: ఆంజనేయపురం సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లె గ్రామానికి చెందిన నరసింహులు(60) పొలం పనులకు వెళ్లి తెలుగుగంగ కాలువ వద్ద రోడ్డు దాటుతుండగా అబ్బీపురం గ్రామానికి చెందిన బాలవర్ధన్ రాజు ఆటోలో వెళ్తూ ఢీకొన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వెంటనే తన వాహనంలో వృద్ధుడిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్ తరలించారు. అయితే కోలుకోలేక నరసింహులు మృతి చెందాడు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

బండి ఆత్మకూరు: ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పనూరు గ్రామానికి చెందిన ఎర్రద్దుల బ్రహ్మయ్య (33) అనే వ్యక్తి బుధవారం రాత్రి నంద్యాల వైపు బైక్‌పై వెళ్తుండగా.. ఎర్రగుంట్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీకి బీజేపీ మోసం

- యూత్ కాంగ్రెస్ నాయకుల ఆందోళన

కర్నూలు టౌన్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు విమర్శించారు. గురువారం కర్నూలు శివారులో జరిగిన ప్రధాని సభ ప్రధాన ద్వారం వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ మోదీ గోబ్యాక్ అంటూ నినదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మోదీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిలువునా ముంచిందన్నారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు బలవంతంగా అక్కడి నుండి తరలించారు. యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దస్తగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్, కృష్ణ, సోమేష్, సూర్య, గిడ్డయ్య పాల్గొన్నారు.

అధికారుల వైఫల్యం.. అంతా అస్తవ్యస్తం

- ప్రధాని పర్యటనలో అడుగడుగునా లోటుపాట్లు
- పార్కింగ్ ప్రాంతాల నుంచి సభకు చేరుకునేందుకు అవస్థలు
- అల్పాహారం పంపిణీలో నిర్లక్ష్యం
- మైకులు పని చేయక వినిపించని ప్రధాని ప్రసంగం


మజ్జిగ ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న ప్రజలు


పూడిచెర్ల మెట్ట సమీపంలో జనాన్ని తరలిస్తున్న బస్సు పంక్చర్ అయిన దృశ్యం

ఓర్వకల్లు/పాణ్యం: ప్రధాని నరేంద్ర మోదీ సభలో అధికారుల వైఫల్యం కనిపించింది. ఓ వైపు రూ.కోట్లలో ప్రజాధనం వృథా కాగా.. మరో వైపు సభకు వచ్చిన జనం అడుగడుగునా అవస్థలు పడ్డారు. నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద గురువారం నిర్వహించిన భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ ఏర్పాట్లలో అధికారులు వైఫల్యం చెందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని పర్యటనలో చోటుచేసుకున్న లోటుపాట్లలో మచ్చుకకు కొన్ని..

➤ ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 2 వేల దాక ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో ప్రజలను బహిరంగ సభకు తరలించారు. ఆయా వాహనాల్లో వచ్చిన ప్రజలను పార్కింగ్ ప్రదేశాల వద్ద వదిలిపెట్టారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న సభ ప్రాంగణం వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి రావడంతో జనం బేజారిపోయారు.

➤ మోదీ పర్యటనకు 5 గంటల ముందుగానే ప్రజలు రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అయితే కూర్చోవడానికి కుర్చీలు లేక విసుగెత్తిపోయిన జనం ప్రధాని రాక ముందే వెనుదిరిగి తమ వాహనాల వద్దకు వెళ్లిపోయారు.

➤ సభా ప్రాంగణం నుంచి 2 కి.మీ పొడవున అమర్చిన మైకులు పనిచేయక పోవడంతో ప్రధాని ప్రసంగాన్ని వినలేని పరిస్థితి ఏర్పడింది.

➤ ఒకవైపు ప్రధాని ప్రసంగం జరుగుతుండగానే మధ్యలోనే ప్రజలు వాటర్ బాటిళ్ల కోసం అవస్థలు పడ్డారు. సభలోకి బాటిళ్లను అనుమతించకపోవడంతో దాహంతో అలమటించారు. సభ బయటకు వచ్చి వాహనాల వద్ద ఏర్పాట్లు చేసిన బాటిళ్లు, ప్యాకెట్ల కోసం ఎగబడాల్సి వచ్చింది.

➤ సభకు హాజరైన జనం కోసం అల్పాహారం కింద అరటి పళ్లు, మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేశారు. వీటిని సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో సభ మధ్యలోనే వచ్చిన జనం వాటికోసం ఎగబడి, బలవంతంగా తీసుకెళ్లారు.

➤ ప్రధాని పర్యటనకు విధుల రీత్యా హాజరైన పోలీసు, ఆర్టీసీ, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖలల్లో పనిచేస్తున్నట్లు కిందిస్థాయి సిబ్బందికి మధ్యాహ్నం సమయంలో భోజనం ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు సరైన సమయానికి అందక ఆకలితో అలమటించినట్లు తెలుస్తోంది.

➤ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభా వేదికపైకి చేరుకోగా అప్పటికే కొంత మంది ప్రజలు తమ వాహనాల వద్దకు తిరుగుముఖం పట్టారు.

➤ కొంత మంది తెలుగు తమ్ముళ్లు ఆయా పార్టీ జెండాకు అమర్చిన ఇనుపపైపులను, వెదురు కర్రలను భుజాన వేసుకోని పయనమయ్యారు.

➤ సాయంత్రం 4.30 గంటలకు సభ ముగియడంతో ప్రముఖులు తిరుగు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో నన్నూర్ టోల్‌గేట్ వద్ద దాదాపుగా 10 నిమిషాల పాటు టోల్‌గేట్ వద్ద రాకపోకలు నిలివేశారు. దీంతో టోల్‌గేట్ వద్ద కనుచూపు మేర వాహనాలు నిలిచిపోయాయి.

➤ సభ ముగిసిన తర్వాత కొంత మంది డ్రైవర్లు జనాన్ని వదిలేసి ఖాళీ బస్సులతో తమ డిపోలకు తిరుగు ప్రయాణమయ్యారు.


టోల్‌గేట్ వద్ద వాహనాలు నిలిపివేసిన పోలీసులు


అరటి పండ్ల కోసం గుమికూడిన ప్రజలు


ప్రముఖులు ప్రసంగిస్తుండగా వెనుదిరిగిన మహిళలు

మోదీ సభకు మొరాయించిన బస్సు


ఆగిపోయిన బస్సును తోస్తున్న మహిళలు

కర్నూలులో జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభకు మండల ప్రజలతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు మార్గమధ్యలోనే మొరాయించింది. అలారుదిన్నె నుంచి కర్నూలుకు బయలుదేరిన బస్సు దేవనకొండ క్రాస్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఆగిపోయింది. ఎంతకీ కదలకపోవడంతో బస్సులో ఉన్న మహిళలు దిగి బస్సును తోసిన క్రమంలో ముందుకు కదిలింది. – దేవనకొండ

కర్నూలులో బంద్ వాతావరణం

- వ్యాపార సంస్థలన్నీ మూత

కర్నూలు(అగ్రికల్చర్): దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన నేపథ్యంలో కర్నూలులో బంద్ వాతావరణం కనిపించింది. ప్రధాన రహదారులపై మెడికల్ షాపులు మినహా ఇతర వ్యాపార సంస్థలన్నీ మూత పడ్డాయి. ప్రధాని సభకు జనాలను తీసుకెళ్లే బస్సులు మినహా ఇతరత్రా వాహనాలూ కనిపించలేదు. కొత్తబస్టాండు నుంచి సీ. క్యాంపు సెంటరు, నంద్యాల చెక్‌పోస్టు వరకు వ్యాపార సంస్థలను మూసి వేశారు. ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు భారీగా తగ్గిపోయాయి. 95 శాతం ఆర్‌టీసీ బస్సులను పీఎం సభకు జనాలను తరలించడానికే ఉపయోగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాని సభకు రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు చెందిన ఆర్‌టీసీ బస్సులతో సహా తెలంగాణా బస్సులకు కూడా వినియోగించారు. అయితే చాలా వరకు బస్సుల్లో సగం సీట్ల వరకు కూడా జనాలు కనిపించలేదు.

వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి

- కర్ణాటక బళ్లారి ఎంపీ తుకారామ్


గూళ్యం సమీపంలోని వేదావతి వంతెనపై పర్యటిస్తున్న కర్ణాటక ఎంపీ, ఎమ్మెల్యేలు

హాలహర్వి: కర్ణాటక-ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో ఉన్న వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఎంపీ తుకారామ్ అన్నారు. గురువారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామ సమీపంలోని వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం, వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఎంత నిధులు ఖర్చు అవుతాయన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం గాది లింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. శ్రీ గాదిలింగేశ్వరస్వామి ఆశీర్వాదంతో గతంలో తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎంపీగా ఎన్నికయ్యానన్నారు. గూళ్యం గ్రామ సమీపంలో ఉన్న వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల పరిధిలోని గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ విషయాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్తామన్నారు. 2026 ఉగాది రోజున వేదావతి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బళ్లారి నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, కంప్లీ ఎమ్మెల్యే గణేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి శశికళ కృష్ణమోహన్, గూళ్యం మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, కురువ సంఘం నాయకులు పూజారి మల్లన్న, బజారప్ప, వీరేశప్ప, లింగమల్లప్ప, మాజీ ఎంపీపీ గాదిలింగప్ప, తిప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ఎలా చదువుతారు?

- గురుకులం నిర్వహణ లోపాలపై మంత్రి సవిత ఆగ్రహం


భోజనాన్ని పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వెల్దుర్తి: వందలాది బాలికలు చదువుకునే గురుకులం నిర్వహణ ఇంత అధ్వానమా.. అంటూ బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి సవిత వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె కర్నూలులో ప్రధానమంత్రి పర్యటనకు హాజరై తిరిగి అనంతపురం వెళ్తూ మార్గమధ్యలో వెల్దుర్తి బీసీ గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థినుల వద్దకు వెళ్లి ఎలా చదువుతున్నారని, భోజన, సౌకర్యాలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. అనంతరం స్టాఫ్ రిజిస్టర్, భోజన సరుకుల స్టాక్ రిజిస్టర్‌లు అందుబాటులో లేకపోవడం, భోజన సరుకులు నాణ్యత లేకపోవడం, వాసన వచ్చేంత వరకు వాడకుండా ఉంచడం, ఆ సమయంలో గురుకులంలో ప్రిన్స్‌పాల్, వార్డెన్ తదితరులు లేకపోవడంతో.. ఇదేనా నిర్వహణ అంటూ వైస్ ప్రిన్స్‌పాల్ రాధపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమ శాఖ సెక్రటరీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాలికల గురుకులంలో ముగ్గురు యువకులు పనిచేస్తుండడంపై ఇదేమిటంటూ ప్రశ్నించారు. పాఠశాలకు సొంత భవనం, గ్రౌండ్ లేదని విద్యార్థినులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే ద్వారా వెల్దుర్తి బీసీ గురుకల పాఠశాలకు సొంత భవన ఏర్పాటు కోరుతూ వినతి వచ్చిందని, త్వరలో తగు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు

- చెన్నారెడ్డి మృతదేహం లభ్యం
- గల్లంతైన మరో యువకుడు ఉదయ్ కోసం గాలింపు



చెన్నారెడ్డి, ఉదయ్ కుమార్ (ఫైల్)

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద పారుతున్న నీటిలో ఆడుతూ సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తూ కాలు జారి ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు అయ్యారు. చెన్నారెడ్డి మృతదేహం లభ్యం కాగా ఉదయ్‌కుమార్ కోసం గాలిస్తున్నారు. ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం సీఈసీలో ఏఐ చదువుతున్న పీఎన్. చెన్నారెడ్డి(20), ఉదయ్ కుమార్(20), శివ, బాబు, అస్లాబ్, ధనుంజయ్, శ్రీనాథ్, సాయి గణేష్ విద్యార్థులు ఇంట్లో కళాశాలకు వెళ్తామని చెప్పి గురువారం ఉదయం గాజులదిన్నె ప్రాజెక్టుకు వచ్చారు. ప్రాజెక్టు గేట్లు, నీటి నిల్వ పరిసరాల్లో సందడి చేశారు. వారం రోజుల నుంచి గాజులదిన్నె ప్రాజెక్ట్ నాలుగవ క్రస్ట్ గేట్ ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదిలోకి విడుదల చేస్తున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం పారుతున్న నీటిలో ఆడుతూ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. సెల్ఫీలు దిగుతూ కాలు జారి చెన్నారెడ్డి, ఉదయ్ కుమార్ పారుతున్న నీటిలో కొట్టుకొని కిందకు పోయారు. దీన్ని గమనించిన శివ వారిని కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం దక్కలేదు. చెన్నా రెడ్డి, ఉదయ్ కుమార్‌లు నీటిలో కొట్టుకుపోయి కింద ఉన్న నీటి గుంతలో మునిగిపోయారు. ఇద్దరు స్నేహితులు నీటిలో కొట్టుకుపోయి మునిగిపోవడంతో మిగతా వారు కేకలు వేశారు. దీంతో ప్రాజెక్టు అధికారులు గేటును మూసివేశారు. అయితే అప్పటికే వారిద్దరూ నీటిలో గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మత్స్యకారులతో వెతికించారు. సాయంత్రం చెన్నారెడ్డి మృతదేహం లభ్యమైంది. ఉదయ్ కుమార్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. చీకటి పడడంతో కనిపించదని మత్స్యకారులు బయటికి వచ్చారు. శుక్రవారం ఉదయం ఉదయ్ కోసం గాలిస్తామని అధికారులు తెలిపారు. చెన్నారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కన్నీటి పర్యంతం..

'అమ్మా.. కాలేజీకి వెళ్లి వస్తా అని చెప్పి.. ఇంకా రాలేదు కదా' అంటూ ఉదయ్ తల్లిదండ్రులు రోదించారు. ఎమ్మిగనూరుకు చెందిన గోవింద్, రాధలకు ఇద్దరు కుమారులు. వీరు పట్టణంలో మగ్గం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు మనోహర్ బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు ఉదయ్ కుమార్ ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం సీఈసీలో ఏఐ చేస్తున్నాడు. గురువారం ఉదయం కాలేజీ వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వచ్చాడు. '3 గంటల సమయంలో మీ వాడు గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో మునిగి పోయాడని ఫోన్ వచ్చిందని మేము ఇకా ఎవరి కోసం బతకాలి' అంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించాయి.


రోదిస్తున్న ఉదయ్ కుమార్ తల్లిదండ్రులు

ఎందుకు బతకాలి?

'ఉన్న ఒక్క కొడుకును పోగొట్టుకుని మేం ఎందుకు బతకాలిరా' అంటూ చెన్నారెడ్డి తల్లిదండ్రులు మోహన్ రెడ్డి, శకుంతలు రోదించారు. ఎమ్మిగనూరుకు చెందిన మోహన్ రెడ్డి, శకుంతలకు ఒక కుమారుడు చెన్నారెడ్డి, ఇద్దరు కూమార్తెలు వైష్ణవి, చైతన్య ఉన్నారు. వీరు ఎమ్మిగనూరు పట్టణంలో హోటల్ పెట్టుకుని పిల్లల్ని చదివిస్తున్నారు. గత ఐదేళ్లుగా తండ్రి మాలేశ్వర రెడ్డి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లి ఒక్కటే హోటల్ నడుపుతూ పెద్ద కూతురుకు వైష్ణవికు వివాహం చేశారు. హోటల్‌లో వచ్చిన సంపదనతోనే చెన్నారెడ్డిని, చైతన్యను చదివిస్తున్నారు. చెన్నారెడ్డి మృతిచెందిన సంఘటన తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రాజెక్టుకు చేరుకొని ఒక ఏడాదిలో చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తూ మమ్మల్ని పోషిస్తాడని ఎన్నో ఆశాలు పెట్టుకున్నాం. కానీ మమ్మల్ని ఇలా ఒంటరిని చేసి వెళ్లి పోతావని అనుకోలేదని ఉన్న ఒక్క కుమారుడు పోయాడు. ఇక మేము ఎందుకు బతకాలి అని తల్లిదండ్రులు రోదించారు.

ఎవరూ ముందుకు రాలేదు

మా స్నేహితులు నీటిలో కొట్టుకుపోయారని, కేకలు వేస్తూ సమీపంలో ఉన్న వారందరినీ వేడుకున్నా ఎవరు ముందుకు రాలేదు. నీటిలో మునిగిపోయారు సహాయం చేయండని వేడుకున్నా ఒక్కరూ కూడా సహాయం చేయలేదు. ఆ సమయంలో ఎవరైనా సహాయం చేసి ఉంటే మా స్నేహితులు బతికి ఉండేవారు. – చెన్నారెడ్డి, ఉదయ్ స్నేహితులు

ఫోన్ మాట్లాడుతూ కుప్పకూలిన యువకుడు

- గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి


మృతి చెందిన అబ్దుల్ రహిమాన్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో గురువారం మధ్యాహ్నం గుండె పోటుతో ఓ బీటెక్ విద్యార్థి హఠాన్మరణం చెందాడు. పట్టణంలోని ముగతి పేటకు చెందిన ఫారూక్, రెహెనాబానుల కుమారుడు అబ్దుల్‌రహీమాన్ (22) బీటెక్-సీఎస్‌బీ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసి చెట్టు కింద ఫోన్ మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటుతో మృతి వలనే మృతి చెందినట్లు చెప్పారు. కాగా ఇదే రోజు గాజులదిన్నె వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఓ విద్యార్థి మృతి చెందడం, మరో విద్యార్థి గల్లంతు కావడం, ఇంకో విద్యార్థి గుండెపోటుతో మృతి చెందడంతో కళాశాలలో విషాదం అలుముకుంది.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

- పాత రైల్వే వంతెనను ఢీకొన్న లారీ, డ్రైవర్ దుర్మరణం


వంతెనను ఢీకొన్న లారీ


గాయపడి మృతి చెందిన డ్రైవర్ రాజు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. బొగద వంతెన దాటిన తర్వాత ఉన్న పురాతన రైల్వే వంతెన వద్ద ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు నుంచి విజయవాడ వెళుతున్న లారీ మలుపు వద్ద అదుపు తప్పి పురాతన వంతెనను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వంతెన గోడ, లారీ మధ్య ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ రాజు (42) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదిలా ఉండగా లారీ రోడ్డుకు అడ్డుగా ఉండటంతో సుమారు ఆరు గంటల పాటు నల్లమల ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలు స్తంభించాయి. నంద్యాల నుంచి విజయవాడ, విజయవాడ వైపు నుంచి నంద్యాల, కర్నూలు, అనంతపురం మీదుగా ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న గిద్దలూరు, మహానంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. రెండు క్రేన్లను తీసుకెళ్లి వాటి సాయంతో రోడ్డుపై అడ్డుగా ఉన్న లారీని పక్కకు తప్పించడంతో ఆరు గంటల తర్వాత వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ప్రమాద స్థలం గిద్దలూరు పరిధికి రావడంతో గిద్దలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


టెంపోలో మూటాముల్లె సర్దుకుని వలస వెళ్తున్న కోసిగి గ్రామ కూలీలు


కోసిగిలో వలస వెళ్లేందుకు సిద్ధంగా కూలీలు

పల్లెలు సుగ్గి బాట

- బతుకు తెరువు కోసం కొనసాగుతున్న వలసలు

కోసిగి: సొంతూరిలో ఉపాధి కరువై బతుకుదెరువు కోసం పనులు వెతుకుంటూ వ్యవసాయ కూలీలు వలస బాట పడుతున్నారు. వారం రోజులుగా మండలంలో పల్లెలు ఖాళీ అవుతున్నాయి. పిల్లాపాపలతో కలిసి ఇళ్లకు తాళాలు వేసి మూటాముల్లె సర్దుకుని సూదూర ప్రాంతాలకు తరలి వెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గురువారం రోజున ఏకంగా 30 టెంపోలకు పైగా 2 వేల మంది మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలి వెళ్లారు. వారం రోజుల పాటు దాదాపు మండలం నుంచి 10 వేల మందికి పైగా తరలి వెళ్లినట్లు కూలీలు చెబుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు కారణంగా పంటలు పూర్తి దెబ్బతినడంతో రైతులు కూడా పొలాలను వదిలి వెళ్లి పోతున్నారు. కోసిగిలోని కింద మారెమ్మ దేవి, నాగన్న గేరి, రైల్వే స్టేషన్, రామక్కమ్మ ఆలయం, యల్లమ్మ దేవాలయాల సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు తరలి వెళ్లారు. అలాగే మండలంలోని దుద్ది, కామన్‌దొడ్డి, ఆర్లబండ, చింతకుంట, పల్లెపాడు, జుమ్మాలదిన్నె, వందగల్లు, చిర్తనకల్లు, సజ్జలగుడ్డం గ్రామాలతో పాటు పెద్దకడబూరు మండలంలోని గవిగట్టు , పీకల బెట్ట, బాపులదొడ్డి, కౌతాళం మండలంలోని కరణి, చూడి, గుడికంబాలి గ్రామాల నుంచి గ్రామానికి రెండేసి చొప్పున టెంపోలలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ పత్తితీత పనులు ఉండటంతో అక్కడికి వెళ్తున్నారు. బడికి వెళ్లే పిల్లలను బడి మానిపించి తమ వెంట తీసుకెళ్లారు. పిల్లలు కూడా అక్కడ పనిచేసి నాలుగు డబ్బులు సంపాదించుకుంటామని కూలీలు ఈరన్న, హనుమంతు, లక్ష్మీ, ఈరమ్మలు తెలిపారు. 'ఇక్కడే ఉంటే చేసిన అప్పులు ఎలా తీర్చాలి. పెరిగిన ధరలకు బతకడం కష్టంగా ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు.